
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
మంచిర్యాల
జిల్లా వార్తలు
5
మంగళవారం 9 జనవరి 2024



పీఆర్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా రాజేశ్వర్‌రావు



దండేపల్లి, జనవరి 8: పీఆర్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా దండేపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన నం గర్సు రాజేశ్వర్‌రావు ఎన్నికయ్యారు. ఇటీవల హైద్రాబాద్‌లో జరిగిన పీఆర్‌టీయూ రాష్ట్ర కార్యవర్గ సమావే శంలో రాజేశ్వర్‌రావును ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వేణుగోపాల్, గంగాధర్, మండల అధ్యక్ష, కార్యదర్శులు రవి, లచ్చయ్యలు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పంపిణీ ఎప్పుడు..?

- దుకాణాల చుట్టూ కార్డుదారుల ప్రదక్షిణలు
- సంక్రాంతి పిండి వంటలకు బియ్యం కొరత
- పట్టించుకోని పౌరసరఫరాలశాఖ అధికారులు



మంచిర్యాల, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): చౌక ధరల దుకాణాల్లో బియ్యం నిల్వలు లేక సంక్రాంతి పిండి వంటలకు అవస్థలు తప్పడం లేదు. పండుగ సమీపిస్తున్నా ఇప్పటిదాకా రేషన్ షాపుల్లో బియ్యం పం పిణీ జరగలేదు. ప్రతీ నెల 1వ తేదీ నుంచి రేషన్ షాపుల్లో లబ్ధి దారులకు బియ్యం అందించాల్సి ఉంటుంది. 9 రోజులు గడుస్తున్నా చౌక ధరల దుకాణాలు తెరుచుకోవడం లేదు. పండగపూట దొడ్డు బియ్యం కోసం వెంపర్లాడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. బియ్యం ఎప్పుడు పోస్తారో తెలియని పరిస్థితుల్లో నిత్యం షాపుల చుట్టూ ప్రదక్షిణ చేయాల్సి దుస్థితి కార్డుదారులకు పట్టింది. నిత్యం లబిదారులు వస్తుండటంతో జవాబు చెప్పలేక డీలర్లు దుకాణాలు మూసి ఉంచుతున్నారు. పండుగల సమయంలోనూ సకాలంలో బియ్యం అందజేయడంలో జాప్యంపై లబ్ధిదారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రతీ నెల ఏదో ఒక సాకు చెబుతూ నెలాఖరు దాకా బియ్యం పంపిణీ చేయడం లేదని అసహనానికి గురవుతున్నారు.

సాంకేతిక లోపం నెపంతో

రేషన్ షాపులకు సరఫరా చేసేందుకు మండల స్థాయి స్టాకిస్టు (ఎంఎల్‌ఎస్) పాయింట్లలో సరిపడా బియ్యం నిల్వలున్నా సాంకేతిక లోపం కారణంగా గోదాముల్లోనే మూలుగుతున్నాయి. డీలర్ల వద్దనున్న ఈ-పాస్ యంత్రాల్లో నెలకొన్న సాంకేతిక లోపం కారణంగా అవి తెరుచుకోక బియ్యం కోటా సరఫరా కావడం లేదని పౌరసరాల అధికారులు చెబుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఈ-పాస్ యంత్రాలు పనిచేయక లబ్ధిదారులకు ఇప్పటి వరకు జనవరి నెల బియ్యం పంపిణీ చేయలేదు. దీంతో డీలర్లు దుకాణాలు మూసి ఉంచాల్సిన పరిస్థితి నెలకొంది. పండుగ అంశం పక్కనబెడితే కనీసం తినడానికి కూడా బియ్యం లేక అధిక ధరలకు కిరాణా షాపుల్లో కొనవలసిన పరిస్థితులు నెలకొన్నాయి.

ప్రతీనెల ఇదే తంతు

ఈ-పాస్ యంత్రాల్లో సాంకేతిక లోపం తలెత్తిందని అధికారులు చెబుతున్నప్పటికీ ప్రతీ నెల బియ్యం ఆలస్యంగా పోస్తున్నారని లబ్ధిదా రులు వాపోతున్నారు. వాస్తవానికి చౌక ధరల దుకా ణాల ద్వారా ప్రతీ నెల 1వ తేదీ నుంచి 15వరకు లబ్ధిదారులకు బియ్యం అందజేయాలి. కానీ ఏడెనిమిది నెలలుగా బియ్యం ఎప్పుడు పోస్తున్నారో తెలియని పరిస్థితులు నెలకొన్నాయి. కొన్నిసార్లు బియ్యం నిల్వలు లేక లబ్ధిదారులకు సకాలంలో అందకపోగా, మరి కొన్ని సార్లు ఈ-పాస్ యంత్రాల్లో సాంకేతిక లోపం పేరుతో సరఫరా నిలిపివేస్తున్నారు. దీంతో పంపిణీ తేదీల్లో అనేక మార్పులు చేస్తున్నారు. ప్రతిసారీ నిర్ణీత సమయానికంటే ఐదు రోజులపాటు గడువు పెంచడం, అది పూర్తి కాగానే మళ్లీ పొడిగించడం జిల్లాలో సర్వ సాధారణమైంది. బియ్యం సరఫరా ఎప్పుడవుతుందో డీలర్లకు తెలియని పరిస్థితులు ఉన్నాయంటే అతిశయోక్తికాదు. ఈ క్రమంలో ప్రజల చేత చీవాట్లు తినే ఓపిక లేక దుకాణాలు మూసి ఉంచుతున్నట్లు డీలర్లే చెబుతుండటం గమనార్హం.

పిండి వంటలకు బియ్యం కొరత

సంక్రాంతి పర్వదినం సందర్భంగా ప్రతీ ఇంట్లో పిండి వంటలు తయారు చేయడం ఆనవాయితీ. పండుగకు వారం రోజుల ముందు నుంచే మహిళలు అందుకు సన్నద్ధమవుతారు. రెండు, మూడు రోజులు పిండి వంటలతో ఇంటిల్లిపాది హడావుడిగా గడుపుతారు. ముఖ్యంగా చకినాలు, గారెలు చేసేందుకు రేషన్ షాపుల్లో లభ్యమయ్యే బియ్యాన్ని వినియోగిస్తారు. వాటికి బదులు మార్కెట్లో కొనుగోలు చే ద్దామంటే కొత్త బియ్యం మాత్రమే అందుబాటులో ఉంటాయి. వాటితో పిండి వంటలు తయారు చేయలేమని మహిళలు చెబుతున్నారు. పిండి వంటలకు కేవలం పాత బియ్యం మాత్రమే పనికి వస్తాయని, రేషన్ షాపుల్లో ఇచ్చే బియ్యం సరిగ్గా సరిపోతాయనే అభిప్రా యాలు ఉన్నాయి. మరోవైపు సంక్రాంతికి కేవలం నాలుగు రోజులు మాత్రమే గడువు ఉంది. అయినా చౌక ధరల దుకాణాల్లో బియ్యం పంపిణీ చేయకపోవడం పౌర సరఫరాలశాఖ నిర్లక్ష్యాన్ని తెలియజేస్తోంది. జిల్లా వ్యాప్తంగా 423 రేషన్ షాపులు ఉండగా, ప్రతీ దుకాణానికి సగటున 120 క్వింటాళ్ల సరఫరా కావలసి ఉంది. అయితే నెల ప్రారంభమై 9 రోజులు గడుస్తున్నా చౌక ధరల దుకాణాలకు ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి పూర్తిస్థాయిలో బియ్యం సరఫరా కాలేదు. అసలు సంక్రాంతికి రేషన్ బియ్యం అందుతాయో లేదోనన్న అనుమానం లబ్ధిదారుల్లో నెలకొంది.

కలెక్టరేట్ ఎదుట పశుమిత్రల నిరసన



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న పశుమిత్రలు

నస్పూర్, జనవరి 8: సమస్యలను పరిష్కరించాలని కలెక్టరేట్ ఎదుట సోమవారం పశు మిత్ర వర్కర్స్ యూనియన్ (సీఐటీయు) ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టర్ బదావత్ సంతోష్‌కు అందజేశారు. యూనియన్ నాయకులు మాట్లాడుతూ గ్రామాల్లో రైతుల పశువులు అనారోగ్యం బారిన పడితే వైద్యం అందిస్తున్నామన్నారు. ఇప్పటి వరకు తమకు వేతనాలు ఇవ్వలేదని, కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం వేతనాల విషయంపై ఆలోచించాలని కోరారు. కనీస వేతనాలతోపాటు ఉద్యోగ భద్రత తదితర సౌకర్యాలను కల్పించాలని కోరారు. నాయకులు నాగమణి, లావణ్య, సీఐటీయు జిల్లా కార్యదర్శి రంజిత్ కుమార్, నాయకులు సరోజ, శ్యామల, సరిత, శారద, స్వప్న, జ్యోతి, రమ్య, శైలజా తదితరులు పాల్గొన్నారు.

పొనకల్ పీఏసీఎస్‌లో అవిశ్వాస తీర్మానం



రిజిస్ట్రార్‌కు అవిశ్వాస తీర్మానాన్ని అందిస్తున్న సభ్యులు

జన్నారం, జనవరి 8: పొనకల్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు శీలం రమేష్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెడుతున్నట్లు హైద్రాబాద్‌లోని సంఘం రిజిస్ట్రార్ కార్యాలయంలో సభ్యులు అల్లం రవి, నాయిని సత్యగౌడ్ ఆధ్వర్యంలో 9 మంది నోటీసులు అందజేశారు. దీనిపై విచారణ చేపడతామని రిజిస్ట్రార్ తెలిపినట్లు వారు పేర్కొన్నారు. పొనకల్ సహకార సంఘం అవిశ్వాస తీర్మానంపై మండలంలో ఇప్పటికే 9 మంది సభ్యులు క్యాంపునకు వెళ్లినట్లు తెలుస్తోంది. సంఘంలో అధ్యక్షుడు, ఉపాధ్యక్షునితో కలిపి 13 మంది సభ్యులు ఉండగా 9 మంది తీర్మానం పెట్టినట్లు తెలిసింది.

క్యాంపునకు బయలుదేరిన కాంగ్రెస్ కౌన్సిలర్లు



బస్సులో క్యాంపునకు వెళ్తున్న కాంగ్రెస్ కౌన్సిలర్లు

బెల్లంపల్లి, జనవరి 8 : బెల్లంపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, వైస్ చైర్మన్ సుదర్శన్‌లపై ఈ నెల 12వ తేదీన అవిశ్వాసంపై సమావేశం నిర్వహించేందుకు మున్సిపల్ కౌన్సిలర్లకు కలెక్టర్ నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. సోమవారం కాంగ్రెస్ కౌన్సిలర్లు బస్సులో క్యాంపునకు తరలి వెళ్లారు. ఇప్పటికే బీఆర్ఎస్ పార్టీకి చెందిన 20 మంది కౌన్సిలర్లువెళ్లగా కాంగ్రెస్ పార్టీకి చెందిన 10 మంది కౌన్సిలర్లు క్యాంపు బాట పట్టడంతో మున్సిపల్ రాజకీయం రసవత్తరంగా మారుతోంది. ఇప్పటికే మున్సిపల్ కౌన్సిలర్లకు ఈ నెల 12న అవిశ్వాసంపై సమావేశం ఉంటుందని కలెక్టర్ బదావత్ సంతోష్ నోటీసులు జారీ చేశారు. దీంతో చైర్‌పర్సన్, వైస్ చైర్మన్ పదవుల రేసులో ఉన్న వారు క్యాంపు రాజకీయాలకు తెరలేపారు.

కొత్త పింఛన్ విధానాన్ని రద్దు చేయాలి



బెల్లంపల్లిలో నిరాహార దీక్ష చేస్తున్న రైల్వే కార్మికులు

బెల్లంపల్లి, జనవరి 8: కొత్త పింఛన్ విధానాన్ని రద్దు చేసి పాత పింఛన్ విధానాన్ని కొనసాగించాలని సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ కార్మికులు సోమవారం రైల్వేస్టేషన్ ఎదుట ఒక రోజు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. యూనియన్ నాయకులు మాట్లాడుతూ కొత్తపింఛన్ విధానం వల్ల పదవి విరమణ పొందిన కార్మికులకు అనేక ఇబ్బందులు ఉన్నాయన్నారు. విరమణ కార్మికుల శేష జీవితం ఆనందంగా గడపాలంటే పాత పింఛన్ విధానం అమలు చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం రైల్వే కార్మికుల సమస్యలను పరిష్కరించాలన్నారు. లేకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నాగరాజు, సాంబశివుడు, చిరంజీవి, శ్రీనివాస్, రమేష్, కార్మికులు పాల్గొన్నారు.

ఓరియంట్ ఎన్నికలపై ముగిసిన సమావేశం



కార్యాలయం ఎదుట మాట్లాడుతున్న కార్మిక సంఘాల నాయకులు

కాసిపేట, జనవరి 8: ఓరియంట్ సిమెంటు కంపెనీ గుర్తింపు సంఘం ఎన్నికల్లో భాగంగా సోమవారం మంచిర్యాల అసిస్టెంట్ లేబర్ కమిషనర్ కార్యాలయంలో రెండో సమావేశం ముగిసింది. కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ ఓరియంట్ సిమెంట్ కంపెనీలో గుర్తింపు సంఘం కాలపరిమితి ముగిసినప్పటికీ గుర్తింపు సంఘం ఎన్నికల నిర్లక్ష్యంలో యాజమాన్యం, అధికారులు జాప్యం చేస్తున్నారన్నారు. వెంటనే ఎన్నికలు నిర్వహించాలని కోరారు. సమావేశంలో యూనియన్‌లకు సంబంధించిన పలు పత్రాలను నాయకులు అందించారు.

కంటి వైద్య శిబిరం

బెల్లంపల్లి, జనవరి 8 : పట్టణంలోని 1వ వార్డులోని నవదుర్గ గణేష్ మండలి వద్ద టింకరి అఖిల, పొట్ల సురేష్, బస్తీ యూత్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని వన్‌టౌన్ సీఐ బన్సీలాల్ ప్రారంభించారు. ముందుగా సీఐ కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డు ప్రజల కోసం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. కంటి వైద్య నిపుణులు కిరణ్‌కుమార్, అంజయ్యలు ప్రజలకు కంటి వైద్య పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

భూ కబ్జాలపై ఫిర్యాదుల వెల్లువ



ఎంపీడీవోకు ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

చెన్నూరు, జనవరి 8: చెన్నూరు కుమ్మరికుంట చెరువు శిఖం భూమి కబ్జాకు గురవుతుందని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో కాంగ్రెస్ నాయకులు ఫిర్యాదు చేశారు. ఎన్నికల సమయంలో కొందరు భూకబ్జాదారులు చెరువు శిఖం భూమిని కబ్జా చేసి సర్వే నెంబరు 971లో ఇల్లు నిర్మించుకొన్నామన్నారు. మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. కబ్జాకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు చెన్న సూర్యనారాయణ, కౌన్సిలర్ పోగుల సతీష్, నాయకులు శ్రీధర్, నాగరాజు, రాకేష్, మహేష్, సుశీల్‌కుమార్, శ్రీనివాస్, రవి, ఉదయ్, సాహీర్, కరీం పాల్గొన్నారు.

- జర్నలిస్టులకు కేటాయించిన భూమి కబ్జాకు గురైందని, భూమిని కాపాడాలని తహసీల్దార్, సీఐ, మున్సిపల్ కమిషనర్‌లకు వినతిపత్రం అందించారు. జర్నలిస్టులు మాట్లాడుతూ చెన్నూరులో ఇండ్ల నిర్మాణానికి కేటాయించిన సర్వే నంబరు 863 భూమిలో కొందరు రియల్ వ్యాపారం చేసేందుకు కబ్జా చేస్తున్నారన్నారు. కత్తెరశాల రోడ్డులో గల సర్వే నెంబరు 863లో 8 ఎకరాల 5 గుంటల భూమిని ఇండ్ల నిర్మాణానికి అప్పటి రెవెన్యూ అధికారులు ప్రొసీడింగ్ అందజేశారన్నారు. ఇండ్ల నిర్మాణాల్లో జాప్యం జరగడంతో రియల్ వ్యాపారులు కబ్జా చేస్తున్నారన్నారు. వెంటనే భూమిని కాపాడి న్యాయం చేయాలని కోరారు.

ఆసుపత్రి భూమి కబ్జాపై

నెన్నెల: చిత్తాపూర్‌లో శిథిలావస్థలో ఉన్న ఐటీడీఏ ఆసుపత్రి భూమి ఆక్రమణకు గురైందని గ్రామస్థులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సర్వే నంబరు 141-1లో 1986 నుంచి 1993 వరకు ఐటీడీఏ ఆసుపత్రి నిర్వహించారు. 25 పడకలు, ఆపరేషన్ థియేటర్ ఉండేదన్నారు. ఆసుపత్రి ఎత్తివేయడంతో ప్రస్తుతం భవనం శిథిలావస్థకు చేరింది. భూమిని ఓ బీఆర్ఎస్ నాయకుడు ఆక్రమించుకొని చుట్టు ఫెన్సింగ్ ఏర్పాటు చేశాడని తెలిపారు. భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకొని నిరుపేదలకు కేటా యించాలని కోరారు. విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని బెల్లంపల్లి ఆర్డీవోను కలెక్టర్ ఆదేశించారు.

వృత్తి శిక్షణ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

తాండూర్, జనవరి 8: బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి, మాదారం టౌన్‌షిప్‌లో సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో టైలరింగ్, మగ్గం, బ్యూటీషియన్ కోర్సుల ఉచిత శిక్షణ కోసం మహిళలు, యువతులు దరఖాస్తు చేసుకోవాలని అధికార ప్రతినిధి రెడ్డిమల్ల తిరుపతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాల కోసం 9951214116లో సంప్రదించాలన్నారు.

మండల స్థాయి కాంప్లెక్స్ సమావేశం

తాండూర్, జనవరి 8: మండలంలోని తంగళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం నోడల్ అధికారి సూరమల్ల మల్లేశం అధ్యక్షతన మండల స్థాయి కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఎంఈవో వాసాల ప్రభాకర్ హాజరై మాట్లాడారు. విద్యార్థులు గణితములకు సంబంధించిన చతుర్వేద ప్రక్రియలు సాధించేకునేలా ఉపాధ్యాయులు ప్రయత్నించాలన్నారు. సమయపాలన పాటించని ఉపాధ్యాయులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రధానోపాధ్యాయుడు జయ ప్రకాష్, ఉపాధ్యాయులు, రీసోర్స్ పర్సన్‌లు విద్యాసాగర్, వేణుగోపాల్, రాణి, రజిత, సీఆర్‌పీలు నాగరాజు, తిరుపతి పాల్గొన్నారు.

పోస్టర్ల విడుదల



పోస్టర్లను విడుదల చేస్తున్న కలెక్టర్

మంచిర్యాల కలెక్టరేట్, జనవరి 8: ప్రేమ్‌సింగ్ మహారాజ్ 45వ గురుకృప వేడుకల పోస్టర్లను సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ బదావత్ సంతోష్ విడుదల చేశారు. ఈ నెల 11న జరిగే వేడుకలకు జిల్లాలోని బంజారాలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. బంజారా జేఏసీ జిల్లా అధ్యక్షుడు సాపాట్ శంకర్‌నాయక్, ప్రకాష్‌నాయక్, భుక్య రవినాయక్, పురుషోత్తం, సంతోష్, సందీప్ నాయక్, పూజారీ సంకలాల్‌నాయక్, లౌడియా లోకేష్, వసంతరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రీన్‌ఫీల్డ్ హైవే సర్వేను అడ్డుకున్న రైతులు



సర్వేను అడ్డుకుంటున్న రైతులు, ధర్నా చేస్తున్న బాధితులు

హాజీపూర్, జనవరి 8: ఎన్‌హెచ్ 63 గ్రీన్‌ఫీల్డ్ హైవే సర్వేను సోమవారం ముల్కల గ్రామానికి చెందిన రైతులు అడ్డుకున్నారు. తహసీల్దార్ సతీష్‌కుమార్, ఆర్ఐ మంగ, సర్వేయర్ కృష్ణప్రియ, సిబ్బంది సర్వే చేయడానికి రాగా రైతులు అడ్డుకుని నిరసన తెలిపారు. రైతులు మాట్లాడుతూ సర్వేలు చేస్తూ ఇబ్బందులు పెడుతున్నారని, విలువైన వ్యవసాయ భూముల నుంచి రహదారి వెళ్తుండడంతో తమ భూములను కోల్పోవాల్సి వస్తుందన్నారు. సమాచారం ఇవ్వకుండా సర్వే చేస్తున్నారని మండిపడ్డారు. గ్రీన్‌ఫీల్డ్ హైవేను పొలాల మీదుగా కాకుండా జాతీయ రహదారి వెంబడి విస్తరణ చేయాలని కోరారు. తమకు ముందుగా సమాచారం ఇచ్చి తమ డిమాండ్లు పరిష్కరించిన తర్వాత సర్వే చేయాలన్నారు. రైతులు సర్వేను అడ్డుకోవడంతో అధికారులు వెళ్లిపోయారు.

హైవేను రీ డిజైన్ చేయాలి

రామకృష్ణాపూర్: గ్రీన్‌ఫీల్డ్ హైవే-63 రీడిజైన్ చేయాలని క్యాతన్‌పల్లి సమీపంలోని ఎంఎస్‌ఆర్ గార్డెన్ ప్లాట్లు, ఇండ్ల బాధితులు కోరారు. సోమవారం వారు మంచిర్యాల-రామకృష్ణాపూర్ రహదారిపై ధర్నా చేపట్టారు. భవిష్యత్ అవసరాల కోసం కొనుగోలు చేసిన ప్లాట్లు హైవేలో పోయే అవకాశం ఉండడంతో ఆర్థికంగా నష్టపోతామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్లాట్లు, ఇండ్లు కోల్పోకుండా హైవేను రీ డిజైన్ చేయాలని కలెక్టర్ సంతోష్‌కు వినతిపత్రం అందజేశారు.

డంప్ యార్డులో ఎగిసిన మంటలు

- పొగతో ఇబ్బందులు పడిన స్థానికులు



డంప్ యార్డు వద్ద మాట్లాడుతున్న కమిషనర్

నస్పూర్, జనవరి 8 : సీసీసీ ముక్కిడి పోచమ్మ గుడి సమీపంలో గల చెత్త డంపింగ్ యార్డులో ఆదివారం అర్ధరాత్రి మంటలు అంటుకోవడంతో భారీగా పొగ వ్యాపించడంతో స్థానికులు ఇబ్బందులు పడ్డారు. రాత్రి వేళ చెత్తకు నిప్పు పెట్టడంతో మంటలు వ్యాప్తి చెందాయి. దీంతో నాగార్జున కాలనీ, సీసీసీ టౌన్‌షిప్, తాళ్లపల్లి పునరావాస కాలనీ, సుందరయ్య కాలనీల్లో దట్టమైన పొగతో నిండిపోయింది. చలి తీవ్రత ఎక్కువ ఉండడం, దట్టమైన పొగ వ్యాపించడంతో స్థానికులను శ్వాస ఆడక ఉక్కిరి బిక్కిరికి గురి చేసింది. కాంగ్రెస్ నాయకులు విషయాన్ని ఎమ్మెల్యే ప్రేంసాగర్ రావుకు చెప్పడంతో మున్సిపల్ అధికారులు మంటలను ఆర్పించారు. సోమవారం ఉదయం మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేష్ సిబ్బంది డంపింగ్ యార్డుకు చేరుకుని ట్యాంకర్ల ద్వారా నీటిని తెప్పించి మంటలను ఆర్పి వేయించారు. దుర్గంధం వస్తోందని స్థానికులు తెలిపారు. చెత్త డంపింగ్ యార్డును దూర ప్రాంతానికి తరలించాలని కోరారు.

గురుకులాల్లో ప్రవేశం కోసం దరఖాస్తులు చేసుకోండి

మంచిర్యాల కలెక్టరేట్, జనవరి 8: 2024-25 విద్యా సంవత్సరానికి గాను జిల్లాలోని గురుకులాల్లో ఐదవ తరగతిలో ప్రవేశానికి విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని కలెక్టర్ బదావత్ సంతోష్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో వీటీజీ సెట్ గోడప్రతులను అదనపు కలెక్టర్ మోతిలాల్, ఆర్డీవో రాములు, డీఈవో యాదయ్య, గురుకులాల ఆదిలాబాద్ రీజియన్ సమన్వయకర్త స్వరూపరాణితో కలిసి ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ 5వ తరగతిలో ప్రవేశానికి ఫిబ్రవరి 11న పరీక్ష నిర్వహిస్తామన్నారు. ఈనెల 20లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. గురుకులాల జిల్లా సమన్వయకర్త బాలభాస్కర్, ప్రిన్సిపాల్‌లు రమేష్, మోహన్ పాల్గొన్నారు.

రేపు లూయిస్ బ్రెయిలీ జయంతి

మంచిర్యాల కలెక్టరేట్, జనవరి 8: నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో ఈ నెల 10న ఉదయం 10.30 గంటలకు లూయిస్ బ్రెయిలీ జయంతి నిర్వహిస్తామని జిల్లా స్త్రీ, శిశు దివ్యాంగుల వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారి చిన్నయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

తప్పులు లేకుండా ఆన్‌లైన్ చేయాలి

మంచిర్యాల కలెక్టరేట్/నెన్నెల, జనవరి 8: ప్రజాపాలనలో స్వీకరించిన దరఖాస్తుల్లోని వివరాలను తప్పులు లేకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అదనపు కలెక్టర్ బి.రాహుల్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం, నెన్నెల మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో డేటా ఎంట్రీ కేంద్రాన్ని సోమవారం తనిఖీ చేశారు. ఈ నెల 17 వరకు పూర్తిస్థాయిలో దరఖాస్తులను ఆన్‌లైన్‌లో తప్పులు లేకుండా నమోదు చేయాలన్నారు. వచ్చిన దరఖాస్తులు, ఇప్పటికి ఆన్‌లైన్ చేసిన వాటి వివరాలను తెలుసుకున్నారు. పేర్లు, వివరాల్లో తప్పులు లేకుండా చూడాలన్నారు. పనిలో వేగం పెంచాలని, రేషన్ కార్డు వివరాలు నమోదయ్యేలా చూసుకోవాలని సూచించారు. అధికారులు నమోదు కార్యక్రమాన్ని పర్యవేక్షించాలన్నారు. తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్, ఎంపీడీవో వరలక్ష్మి, ఎంపీవో శ్రీనివాస్ ఉన్నారు.

సమస్యలను సీఎం దృష్టికి తీసుకువెళ్లిన ఎమ్మెల్యే



సీఎం రేవంత్‌రెడ్డితో ఎమ్మెల్యేలు

ఏసీసీ, జనవరి 8: మంచిర్యాల నియోజక వర్గంలో నెలకొన్న సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనుల గురించి సీఎం రేవంత్‌రెడ్డికి మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు విన్నవించారు. సోమవారం హైద్రాబాద్‌లోని మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధిపై సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు గడ్డం వివేకానంద, గడ్డం వినోద్, వెడ్మ బొజ్జుతో కలిసి మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు పాల్గొన్నారు. ఉమ్మడి జిల్లాలో చేప ట్టాల్సిన పనులు, గత ప్రభుత్వ హయాంలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులు, రహదారులు, గిరిజ నులకు పోడు భూములు తదితర సమస్యలను సీఎం దృష్టికి తీసుకువెళ్లారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలో గోదావరి ఒడ్డున నిర్మించిన మాతా శిశు సంరక్షణ ఆసుపత్రి వరద వస్తే నీట మునుగు తుందని, దీన్ని ఐబీ ప్రాంతానికి తరలించాలని సీఎంకు విన్నవించారు.

విజయ డెయిరీ రైతులను ఆదుకోవాలి

రామకృష్ణాపూర్, జనవరి 8: విజయ డెయిరీ రైతులను ఆదుకోవాలని హైదరాబాద్‌లోని విజయ డెయిరీ తెలంగాణ ఎండీ లక్ష్మీకి సోమారం వినతి పత్రం సమర్పించారు. విజయ డెయిరీ రైతుల పరిరక్షణ సమితి కన్వీనర్లు సాదం రమేష్, వీరమల్లు రాజయ్య, కో-కన్వీనర్ ఇమ్మడి శ్రీనివాస్. వి. సునీల్ కుమార్ నాయకులు కోరారు. పదేళ్లుగా తాము పాడి రైతులుగా ఉంటూ డెయిరీకి పాలు పోస్తున్నామన్నారు. తమకు వచ్చే లాభాలను అధికారులు తమ ఖాతాల్లో వేసుకుంటూ దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపిం చారు. ప్రభుత్వం ప్రకటించిన రూ.5 ఇన్సెంటివ్‌గా ఇవ్వాలని, 50 శాతం సబ్సిడీతో రెండు గేదెలు సబ్సిడీపై ఇవ్వాలని, సొసైటీల ద్వారా ఎన్నికైన వారిని చైర్మన్‌గా నియమించాలని, తదితర సమస్యలను ఎండీకి విన్నవించారు.

సమస్యలను పరిష్కరించాలి

మందమర్రిటౌన్, జనవరి 8 : మున్సిపాలిటీలో ప్రత్యేక పారిశుధ్య పనులతో పాటు సమస్యలను పరిష్కరించాలని సోమవారం మున్సిపల్ కమిషనర్ రాజుకు కాంగ్రెస్ నాయకుడు జావేద్‌ఖాన్ వినతి పత్రం అందించారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులు

నస్పూర్, జనవరి 8: నస్పూర్ మున్సిపాలిటీలో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి ఈపీఎఫ్‌డబ్బు పీఎఫ్‌ఖాతాలో జమ చేయాలని మున్సిపల్ కాంట్రాక్ట్‌వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం అదనపుకలెక్టర్ రాహుల్‌కు వినతిపత్రం అందజేశారు. నాయకులు మాట్లాడుతూ మూడేళ్లనుంచి రూ.1900లను ప్రతీనెల మినహాయిం చుకుంటున్నారన్నారు. సొమ్మును కార్మికులపీఎఫ్ ఖాతాలో జమచేయడం లేదన్నారు. సమస్యనుపరిష్కరం చూపక పోతే సమ్మెలోకి వెళుతామని నాయకులు తెలిపారు. సుదమల్ల హరి కృష్ణ, వెంకటి, మద్దెర్ల సతీష్, దుర్గయ్య, రాజేశ్వర్, రమేష్, రాజం, గణేష్, పాల్గొన్నారు.

ఆదివాసీలకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తాం

కాసిపేట, జనవరి 8: ఆదివాసీ కొలాం గిరిజనుల కోసం మెరుగైన సౌకర్యాలను ప్రభుత్వంకల్పిస్తుందని సర్పంచు ఆడెసౌందర్య, ఎంపీ డీవో ఆలీం అన్నారు. సోమవారం వెంకటాపూర్ పంచాయతీ ఆవర ణలో కొలాంగిరిజనులకు బ్యాంకురుణాలపై అవగాహన కల్పించారు. ఆదివాసీ, కొలాం గిరిజనులకు సబ్సిడీ రుణాలను అందిస్తామన్నారు. గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించనున్నట్లు తెలిపారు. గిరిజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రేపటి నుంచి క్రికెట్ పోటీలు

మందమర్రిరూరల్, జనవరి 8: సారంగపల్లిలో ఈ నెల 10 నుంచి గ్రామీణ క్రికెట్ పోటీలు నిర్వహిస్తామని నిర్వాహకులు చిప్పకుర్తి శ్రీనివాస్ సోమవారం ఒకప్రకటనలో తెలిపారు. క్రికెట్ టెన్నిస్ బాల్ తో ఉంటుందని, 10ఓవర్లతో మ్యాచ్‌ఉంటుందని తెలిపారు. క్రీడాకా రులు ఆధార్ కార్డు తీసుకురావాలని సూచించారు. విజేత జట్టుకు రూ.15వేలు, రన్నర్‌జట్టుకు రూ.5వేలు అందిస్తామన్నారు. ఎంట్రీఫీజు రూ.2వేలు ఉంటుందని తెలిపారు. వివరాలకు 9963539327లో సంప్రదించాలన్నారు.

రాముని అక్షింతలు పంపిణీ

లక్షెట్టిపేటరూరల్, జనవరి 8: పట్టణంలోని గాంధీనగర్‌లో సోమవారం కాంగ్రెస్ నాయకుడు బొప్పుసతీష్ ఆధ్వర్యంలో అయోధ్య పూజిత అక్షింతలను ఇంటింటికి పంపిణీ చేశారు. ఇంటింటా నిత్య హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. అనంతరం సతీష్ దంపతులు హనుమాన్ చాలీసా భజన మండలి సభ్యులకు రూ. 5016విరాళంగా అందజేశారు. దండేపల్లి జెడ్పీటీసీ గడ్డం నాగమణి త్రిమూర్తి,ఎంపీపీగడ్డంశ్రీనివాస్, భజనమండలిసభ్యులు పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబాలకు యువకుల చేయూత

దండేపల్లి, జనవరి 8: రెబ్బెనపల్లి గ్రామానికి చెందిన గొల్ల పూర్ణచందర్, చింతపల్లి గ్రామానికిచెందిన ఎండీరావుఫ్ కుటుంబాల కు సోమవారం యువకులు ఆర్థిక సహాయం అందజేశారు. ఇటీవల రెబ్బెన పల్లిలో గ్యాస్‌సిలిండర్ పేలి ఇంట్లోసామగ్రి దగ్ధమైంది. చింత పెల్లికి చెందిన ఎండీ రావుఫ్‌కు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో కాలు విరిగింది. ఈకుటుంబాలను సర్పంచు జాడితిరుపతి, యువ కులు పరామర్శించి ఆర్థికసహాయంతోపాటు సరుకులు అందజేశారు. పత్తిపాక శ్రీనివాస్, వెంకటేష్, ముత్యంహరీష్‌రాజశేఖర్ పాల్గొన్నారు.

అలాగే తాళ్లపేట గ్రామానికి చెందిన కోట లచ్చన్న, నేరెళ్ల లక్ష్మీలు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా వారి కుటుంబాలను సోమ వారం మాజీ వైస్ ఎంపీపీ ఆకుల రాజేందర్ పరామర్శించారు. రెండు కుటుంబాలకు కలిపి రూ. 8వేల ఆర్థికసహాయం అందిం చారు. కార్యక్రమంలో ఉపసర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు పుట్టపాక తిరుపతి, నాయకులు దయాకర్, దావూద్, రాజశేఖర్, సుంగు, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భీమదేవర జెండా పండుగ


చింతలమానేపల్లిలో జెండావిష్కరిస్తున్న నాయకులు

చింతలమానేపల్లి, జనవరి 8: మండలంలో ఘనంగా భీమ దేవర పండుగను ఆదివాసీ(కొలావార్) సంఘం నాయకులు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివాసీ జెండాను ఆవిష్కరించి సంబరాలు జరుపుకున్నారు. కర్జవెల్లి గ్రామంలో ఎంపీపీ నానయ్య, సర్పంచ్ నానయ్య, నాజీం హుస్సేన్, భీమయ్య, రంగన్న, సత్యన్న, నారాయణ, సురేష్, తిరుపతి, గౌరయ్య, శివరాం తదితరులు పాల్గొన్నారు.

దహెగాం: మండలంలోని బీబ్రా, హత్తిని, కల్వాడ, కొంచవెల్లి, చంద్రపల్లి, పంబాపూర్, దహెగాం తదితర గ్రామాల్లో ఆదివాసీ కొలావార్(మన్నెవార్) జెండాపండుగను సోమవారం ఘనంగా జరుపుకున్నారు. మహిళలు మంగళహారతులతో తరలివచ్చి భీమదేవర జెండా వద్ద ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ ధనుంజయ్, సర్పంచ్ లక్ష్మి, నాయకులు సంతోష్, దామోదర్, తిరుపతి, సత్తన్న, మల్లేష్, హన్మంతు, రవి, చంద్రయ్య, ఊవన్న తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల ఆవరణలో మిషన్‌భగీరథ నీరు

● ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు


పాఠశాల ఆవరణలో నిలిచిన నీరు

వాంకిడి, జనవరి 8: మండలకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో మిషన్‌భగీరథ నీరునిలిచి ఉండడంతో విద్యా ర్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. నాలుగు వరుసల రోడ్డు విస్తరణలో భాగంగా మిషన్‌భగీరథ పైప్‌లైన్ మరమ్మతు కోసం అధికారులు పదిహేను రోజులక్రితం గుంతను తవ్వారు. మరమ్మతు పనుల్లో జాప్యం కావడంతో నీరంతా పాఠశాల ఆవరణలో నిలిచి పోతోంది. దీంతోవిద్యార్థులు పాఠశాలకు వెళ్లేందుకు, ఆటలాడుకు నేందుకు తీవ్రఇబ్బందికరంగా తయారైంది. దీంతో పాటు పాఠ శాలకు వెళ్లే ప్రధాన రహదారి పక్కన పెద్ద గుంత తవ్వడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరిగుతుందోనని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు భయాందోళనకు గురవుతున్నారు. సత్వరమే మరమ్మతు పనులు పూర్తి చేసి గుంతను పూడ్చి వేయాలని కోరుతున్నారు.

ఆదివాసీల ప్రత్యేక పూజలు

జన్నారం, జనవరి 8: యేటా పుష్యమాసంలో ఆదివాసీల ఆరాధ్యదైవమైన భీమన్న దేవున్ని పూజిస్తారు. మడావి వంశస్తులు ఏడు దేవుళ్లకు సంబంధించిన ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. భీమన్న దేవునికి మొక్కులు చెల్లించేందుకు కొత్తపేటలోని కొలాంగూడలో ఉన్న భీమన్న ఆలయానికి తిర్యాణి మండలంలోని డోలిజెండ గూడ గ్రామానికి చెందిన ఆదివాసీలు మూడు రోజులుగా కాలినడకన కొలాంగూడకు సోమవారం చేరుకున్నారు. ఆదిమ కొలాం గిరిజన జాతి మడావి సంప్రదాయం ప్రకారం కొత్తకోడళ్ల పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించారు. మడావి గుమ్ము, శాంత నూతన వధూవరులను సంప్రదాయబద్ధంగా కుల పెద్దల సమక్షంలో ప్రత్యేక పూజలు నిర్వహించి కొత్త కోడలు పరిచయం నిర్వహించారు. పూజారీ బాపురావు, జడు, ఆత్రం బొజ్జు, మానిక్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నెన్నెల: ఆదివాసి మన్నెవార్లు జెండా పండగను జరుపుకున్నారు. మన్నెవార్ (కోలం వార్)లను ఆదివాసి గిరిజన తెగగా ప్రభుత్వం గుర్తించిన రోజు ఆత్మగౌరవ దినోత్సవాన్ని జరుపుకొంటారు. కోనంపేట, పాటి, కుశ్నపల్లి గ్రామాల్లో సంబరాలు జరుపుకున్నారు. కొడిపె శంకర్, బండి శంకర్, సీతారాం, భీమేష్, ధర్మయ్య, కొడిపె రామయ్య, చీకటి తదితరుల పాల్గొన్నారు.


పూజలు చేస్తున్న ఆదివాసీలు

కన్నెపల్లి: మండల కేంద్రంలో కొలవార్ మన్నె వార్ జెండా పండగను నిర్వహించారు. బోనాలతో డప్పు వాయిద్యాలతో నృత్యాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. కొడిపె వెంకటేష్, మల్లయ్య, లక్ష్మీనారాయణ, నరేష్, భీమేష్‌పాల్గొన్నారు.

హాజీపూర్: భీమదేవర ఆత్మగౌరవాన్ని పురస్కరించుకుని ముల్కల్లలో ఆదివాసీ కొలవారు సంఘం ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరించారు. నాయకులు మాట్లాడుతూ కొలవార్‌లను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సర్పంచు శ్రీనివాస్, నాయకులు మధునయ్య, రాములు, మొగిలి, పోశం,రమేష్, భీమక్క, రాజేష్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి


ప్రసాద్ (ఫైల్)

దండేపల్లి, జనవరి 8: కన్నెపల్లి స్టేజీ సమీపంలో సదానంద ఆలయం పక్కన జాతీయ రహదారిపై సోమవారం కారు ఎదురుగా వచ్చి బైక్‌ను ఢీకొన్న ఘటనలో చిప్ప ప్రసాద్ (26) అనే యువకుడు మృతి చెందాడు. వేమనపల్లి మండలం జిల్లెడ గ్రామానికి చెందిన ప్రసాద్ డ్రిప్ ఇరిగేషన్ కంపెనీలో పనిచేస్తున్నాడు. విధుల్లో భాగంగా జగిత్యాల జిల్లా రాయపట్నం వెళ్లి తిరిగి వస్తుండగా కన్నెపల్లి స్టేజీ సమీపంలో కారు ఎదురుగా వచ్చి ఢీకొట్టింది. తీవ్ర గాయాలైన ప్రసాద్‌ను లక్షెట్టిపేట ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి తండ్రి మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ప్రసాద్ తెలిపారు.

చేపలు పట్టేందుకు వెళ్లి యువకుడు మృతి

ఏసీసీ, జనవరి 8 : మంచిర్యాల పట్టణంలోని రంగపేటకు చెందిన బాగాల అశోక్ (36) చేపలు పట్టేందుకు వెళ్లి ప్రమాదవశాత్తూ నీటిలో పడి చనిపోయినట్లు ఎస్‌ఐ మహేందర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం కూలీ పనులు చేసుకుని జీవించే అశోక్ స్నేహితులతో కలిసి ఆదివారం రాత్రి చేపలు పట్టేందుకు శాలివాహన పవర్ ప్లాంట్‌కు చెందిన నీటి కుంట వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తూ అందులో పడి మృతి చెందాడన్నారు. మృతుడికి ఇంకా వివాహం కాలేదని, మృతుడి అన్న బాపు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ప్రజావాణిలో దరఖాస్తు

వేమనపల్లి, జనవరి 8: వేమనపల్లి మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీడీవో లక్ష్మయ్య అధ్యక్షతన ప్రజావాణి కార్యక్రమం జరిగింది. గొర్లపల్లికి చెందిన స్వేచ్ఛ యువజన సంఘం నాయకులు నీల్వాయి ఎస్టీ కాలనీ నుంచి గొర్లపల్లి వరకు రోడ్డుకు మరమ్మతు చేయించాలని, విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని, రేషన్ డీలర్‌ను నియమించాలని దరఖాస్తు అందజేశారు. ఎంపీవో శ్రీపతి బాపురావు, వ్యవసాయాధికారి వీరన్న, ఏపీఎం ఉమారాణి, సూపర్ వైజర్ సువర్ణ, మండల అధికారులు పాల్గొన్నారు.

సీఎంఆర్ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలి

మంచిర్యాల కలెక్టరేట్, జనవరి 8: సీఎంఆర్ ప్రక్రియను త్వరగా పూర్తి చేసేలా అధికారులు కృషి చేయాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం హైద్రాబాద్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, పౌరసరఫరాల శాఖ కమిషనర్ చౌహాన్‌తో కలిసి కలెక్టర్, అదనపు కలెక్టర్‌లతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. జిల్లాల వారీగా మిల్లుల సామర్థ్యానికి అనుగుణంగా తప్పనిసరిగా మిల్లింగ్ చేసి సకాలంలో పంపించాలని, సీఎంఆర్ ప్రక్రియలో రీసైక్లింగ్ బియ్యం రాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కలెక్టర్ బదావత్ సంతోష్ మాట్లాడుతూ జిల్లాలో 2022-23 సంవత్సరానికి గాను వానాకాలంలో 1,19,177 మెట్రిక్ టన్నుల ధాన్యం రాగా 31 శాతం సీఎంఆర్ పూర్తి కాగా 55,227 మెట్రిక్ టన్నులు, యాసంగిలో 82,859 మెట్రిక్ టన్నుల ధాన్యం రాగా, 14 శాతం సీఎంఆర్ పూర్తి చేసి 47,189 మెట్రిక్ టన్నులు చేయాల్సి ఉందని తెలిపారు. అదనపు కలెక్టర్ మోతిలాల్, జిల్లా సరఫరాల శాఖ అధికారి వాజిద్, అధికారులు పాల్గొన్నారు.


వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ సంతోష్

ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి కృషి

మంచిర్యాల కలెక్టరేట్: ప్రజావాణిలో అందిన దరఖాస్తులను పరిశీలించి సంబంధిత అధికారుల సమన్వయంతో పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ బదావత్ సంతోష్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ మోతిలాల్, ఆర్డీవో రాములుతో కలిసి దరఖాస్తులను స్వీకరించారు. మంచిర్యాల, నెన్నెల, బెల్లంపల్లి, లక్షెట్టిపేట, మందమర్రి, భీమిని, వెంకట్రావుపేట నుంచి ప్రజలు వచ్చి దరఖాస్తులను అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి దరఖాస్తులు త్వరగా పరిష్కరించాలన్నారు.

క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ

ఏసీసీ: తెలంగాణ స్టేట్ యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్ క్యాలెండర్, డైరీని కలెక్టర్ బదావత్ సంతోష్ ఆవిష్కరించారు. జిల్లా అధ్యక్షుడు రామన్న, ఉపాధ్యక్షుడు చక్రపాణి, కోశాధికారి కిరణ్, దేవదాసు, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రజలను భయభ్రాంతులకు గురి చేసిన యువకుల అరెస్టు


పట్టుకున్న యువకులతో సీఐ బన్సీలాల్

బెల్లంపల్లి, జనవరి 8: పుట్టిన రోజు వేడుకల సందర్భంగా రోడ్లపై కేక్‌ను తల్వార్‌తో కట్ చేసి ప్రజలను భయభ్రాంతులకు గురి చేసిన ఇద్దరు యువకులను సోమవారం అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ సీఐ బన్సీలాల్ తెలిపారు. డిసెంబరు 29న కన్నాల బస్తీలో దాసరి అజయ్ అనే యువకుడు పుట్టిన రోజు సందర్భంగా రోడ్డుపై తల్వార్‌తో కేక్ కట్ చేశాడు. వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో అజయ్‌పై కేసు నమోదు చేసి అతన్ని పట్టుకుని తల్వార్‌ను జప్తు చేసి అరెస్టు చేశామన్నారు. రెండు రోజుల క్రితం పోస్టాఫీసు బస్తీ ఏరియాలో హరికృష్ణ అనే యువకుని జన్మదినం సందర్భంగా అనపర్తి సాయిపవన్ అనే యువకుడు ఒక తల్వార్‌ను చేతిలో పట్టుకుని ఫొటో దిగి వాట్సాప్ స్టేటస్ పెట్టడంతో కేసు నమోదు చేసి సాయి పవన్‌ను అరెస్టు చేసి తల్వార్‌ను జప్తు చేశామన్నారు.

ఎవరైనా ప్రజలను ఇబ్బందులకు కలిగించేలా ప్రవర్తించినా, ఆయుధాలు కలిగి ఉన్నా కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు పీడీయాక్టు నమోదు చేస్తామన్నారు.

గంజాయి కేసులో ముగ్గురి బైండోవర్

హాజీపూర్, జనవరి 8 : గతంలో గంజాయి కేసుల్లో నిందితులుగా ఉన్న ముగ్గురు నిందితులను సోమవారం తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్‌ఐ నరేష్ కుమార్ తెలిపారు. పెద్దంపేటకు చెందిన దుర్గం రాజ్‌కుమార్, కర్ణమామిడి గ్రామానికి చెందిన మంద హృతిక్, చిట్యాల సుధాకర్‌లను బైండోవర్ చేసినట్లు తెలిపారు. భవిష్యత్‌లో మళ్లీ తప్పులు చేయకుండా ముందస్తు చర్య ల్లో భాగంగా బైండోవర్ చేయడం జరిగిందని తెలిపారు.

బెల్లంపల్లి: గతంలో గంజాయి రవాణా కేసులో నిందితులుగా ఉన్న ముగ్గురు నిందితులను బైండోవర్ చేసినట్లు వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో బన్సీలాల్ సోమవారం తెలిపారు. బెల్లంపల్లి పట్టణానికి చెందిన ముజ్జు, చీమల సాగర్, తాజ్‌లను బైండోవర్ చేసినట్లు తెలిపారు.

కరెంటు తీగలు తగిలి గడ్డివాము ట్రాక్టర్ దగ్ధం



భీమిని, జనవరి 8: కరెంటు తీగలు తగలడంతో ట్రాక్టర్ ట్రాలీ దగ్ధమైన ఘటన సోమవారం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. మామిడిపల్లి గ్రామానికి చెందిన ఆదె సాయి రైతు పశుగ్రాసాన్ని ట్రాక్టర్‌పై తీసుకెళ్తున్నాడు. భీమిని గ్రామంలో కిందకు ఉన్న విద్యుత్ తీగలు తగిలి మంటలు చెలరేగాయి. దీంతో అప్రమత్తమైన డ్రైవర్ సాయి ట్రాక్టర్‌ను పొలిమేరకు తీసుకవెళ్లి ఇంజన్‌ను తప్పించాడు. సంఘటనలో గడ్డివాము పూర్తిగా దగ్ధం కాగా, ట్రాలీ స్వల్పంగా దగ్ధమైందని బాధితుడు తెలిపారు.

ఆలయ అభివృద్ధికి విరాళం



మందమర్రిటౌన్, జనవరి 8: మారుతినగర్ అభయాంజనేయస్వామి ఆలయ అభి వృద్ధికి ఆలయ అధ్యక్షుడు, యాదవ సంఘం జిల్లా నాయకుడు బండి సదానందం యాదవ్ సోమవారం రూ.10,116 విరాళంగా అందజేశారు. ఆయన మాట్లాడుతూ నాలుగు దశాబ్దాల క్రితం నిర్మించిన ఆలయ పునఃనిర్మాణం కోసం విరాళం అందజేసినట్లు తెలిపారు. అర్చకులు మహేశ్‌శర్మ, కాంగ్రెస్ నాయకులు మల్లేష్, రాజన్న, రవికుమార్, రాజన్న, సదానందం, పోశం, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అయోధ్య రాములోరి అక్షింతల పంపిణీ

● మండల కేంద్రంలో భారీ శోభాయాత్ర


మండలకేంద్రానికి పాదయాత్రగా వస్తున్న భక్తులు

కెరమెరి, జనవరి 8: మండలకేంద్రంలో పంపిణీ చేసిన అయోధ్య రాముడి అక్షింతల కోసం ప్రజలు భారీగా తరలివచ్చారు. సోమవారం మండలంలోని కోటారి, రింగన్‌ఘాట్, రాంనగర్ గ్రామస్థులు మండల కేంద్రానికి బైక్‌ర్యాలీగా తరలివచ్చారు. కేలి(బి), కెలి(కె), సాంగ్వీ, ఇందాపూర్ వైపునుంచి పాదయాత్రగా తరలివచ్చారు. అనార్‌పల్లి వైపు నుంచి వచ్చిన రామభక్తులతో అక్షింతల పంపణీ కార్యక్రమం సందడి మారింది. కార్యక్రమానికి మహిళలు బోనాలతో తరలివచ్చారు. అనంతరం స్థానిక శివాలయంలో వేదపండితుడు బాపుదేవ్‌కులకర్ణి అన్నిగ్రామాల పటేళ్లు, సర్పంచ్‌లకు రాముడి అక్షింతలను అందజేశారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో సెండె నారాయణ, జగన్, రామకృష్ణ, ఎల్లప్ప, తులసీరాం, శంకర్, బాపూజీ, సురేష్, బీజేపీనాయకులు విశాల్, సతీష్ బాబు, వేణుగోపాల్, వేణు పాల్గొన్నారు.

చింతలమానేపల్లి: మండలంలోని డబ్బా చిత్తామ గ్రామాల్లో శ్రీ రామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం అయోధ్య రామ జన్మభూమి పూజిత అక్షింతలను పంపిణీచేశారు. ఈ సందర్భంగా అభయాంజనేయ స్వామి ఆలయం నుంచి బజరంగ్‌దళ్, ఆర్ఎస్ సభ్యులు మహాశోభాయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో మహిళలు, యువకులు, ఆర్ఎ స్ఎస్, బజరంగ్‌దళ్ కార్యకర్తలు, చిత్తామ ఆలయఅర్చకుడు రామయ్య గ్రామస్థులు బాపు,వసంత్, సత్యవన్‌తదితరులు పాల్గొన్నారు.

విద్యతో పాటు క్రీడల్లో రాణించాలి

● జడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు


క్రీడలను ప్రారంభిస్తున్న జడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు

ఆసిఫాబాద్‌రూరల్, జనవరి 8: విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లో రాణించాలని జడ్పీచైర్మన్ కోనేరు కృష్ణారావు అన్నారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని గిరిజనఆదర్శ పాఠశాలలోని క్రీడా మైదానంలో ఎంపీపీ, అరిగెల మల్లికార్జున్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని గిరిజన ఆదర్శ పాఠశాల క్రీడామైదానంలో నిర్వహించిన క్రీడాపోటీలను జడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు, జిల్లా రవాణాధికారి గందం లక్ష్మి, డీఈవో అశోక్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లో రాణించాలన్నారు. గ్రామీణప్రాంత క్రీడాకారుల్లో దాగిఉన్న నైపుణ్యాన్ని వెలికి తీయడంలో ఈ క్రీడాపోటీలు ఎంతగానో ఉపయోగపడు తాయన్నారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకొని క్రీడాపోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో సహకార చైర్మన్ అలీబీన్ అహ్మద్, వైస్‌ఎంపీపీ మంగ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పీఈటీలు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప స్వాముల ఇరుముడి


మాలధారణ చేసుకున్న స్వామికి పూలమాలవేస్తున్న మాజీ ఎమ్మెల్యే పాల్వాయి రాజ్యలక్ష్మి

బెజ్జూరు, జనవరి 8: మండలకేంద్రంలోని రంగనాయక ఆలయ ప్రాంగణంలో సోమవారం అయ్యప్పస్వాముల ఇరుముడి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అయ్యప్ప స్వామికి పూజలు నిర్వహించిన భక్తులు మాల విరమణ కోసం శబరి బయలుదేరారు. ఈ సందర్భంగా గురు స్వామి భిక్షపతి ఆధ్వర్యంలో ఇరుముడి కార్యక్రమం నిర్వహించగా మాజీ ఎమ్మెల్యే పాల్వాయి రాజ్యలక్ష్మి కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

అప్పుల బాధతో ఒకరి ఆత్మహత్య

జైనూర్, జనవరి 8: మండల కేంద్రంలోని పవర్‌హౌస్ కాలనీలో ఆదివారం రాత్రి అప్పుల బాధ, ఆర్థికేతర ఇబ్బందులతో జీవితంపై విరక్తి చెంది షేక్ రియాజ్(53)అనే వ్యాన్ యజమాని వాహనానికి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. జైనూర్ ఎస్సై సందీప్‌కుమార్ వివరాల ప్రకారం.. కొద్దిరోజుల క్రితం షేక్‌రియాజ్ ఐచర్‌వాహనాన్ని కొనుగోలు చేశాడు. ఇందు కోసం రూ.14లక్షల అప్పు చేశాడు. అదేవిధంగా ఇంట్లో కుమార్తె వివాహం, కుటుంబ పోషణ ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. ఈ క్రమంలో ఆర్థిక భారం తట్టుకోలేక జీవితంపై విరక్తిచెంది వ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృత్యుడి భార్య అబుదాబీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సందీప్ కుమార్ తెలిపారు.

అనారోగ్యంతో మాజీ ఎంపీటీసీ మృతి

వాంకిడి, జనవరి 8: మండలంలోని సామెల గ్రామానికిచెందిన మాజీఎంపీటీసీ గుర్నులె పోచయ్య అనారోగ్యంతో ఆదివారం రాత్రి మృతి చెందాడు. కొంతకాలం నుంచి ఆయనఅనారోగ్యంతో బాధపడుతున్నాడు. మృతుడి కుటుంబాన్ని జడ్పీటీసీ అజయ్‌కుమార్ పరామర్శించారు.

సమస్యలు పరిష్కరించాలి

ఆసిఫాబాద్ రూరల్, జనవరి 8: సమస్యలు పరిష్కరించాలని సోమవారం తెలంగాణ సమగ్రశిక్షా ఉద్యోగులసంఘం నాయకులు డీఈవో అశోక్‌కు వినతిపత్రం అందజేశారు. పెండింగ్ వేతనాలు ఇవ్వాలని, తదితర సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో విజయలక్ష్మి, తుకారాం,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్నాక్స్ అందజేత

పెంచికల్‌పేట, జనవరి 8: మండలంలోని చెడ్వాయి జడ్పీపాఠశాలలో 10తరగతి విద్యార్థులకు గ్రామానికి చెందిన కౌసల్యమ్మ స్నాక్స్ అందించారు.కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ రమేష్, ప్రధానోపాధ్యాయుడు రాకేష్, ఉపాధ్యాయులు గంగారాం,నరహరి పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

కుమరం భీం

జిల్లా వార్తలు

8

మంగళవారం 9 జనవరి 2024



అయ్యో.. బెబ్బులి!!



- మరో పెద్దపులి మృతి
- రహస్యంగా ఉంచుతున్న అధికారులు
- అసలు కారిడార్‌లో ఏం జరుగుతోంది..?

కాగజ్‌నగర్, జనవరి 8: పెద్దపులికి పెద్ద కష్టమే వచ్చి పడింది.. అడవిని శాసించే బెబ్బులి జనవాసాల సమీపంలో శాశ్వత నిద్రలోకి జారిపోతున్నాయి. దాంతో తడోబా, కడంబా కారిడార్‌లో పెద్ద పులుల మిస్టరీ మరణాలు వన్యప్రాణి ప్రేమికులను కలవరపరుస్తున్నాయి. శనివారం కాగజ్‌నగర్ దరిగాంలో ఆడ పులి మరణించి ఉండటాన్ని కనుగొనగా తాజాగా సోమవారం కూడా మరోపులి మృతిచెంది ఉండటాన్ని ఇదే ప్రాంతంలో గుర్తించారు. దీంతో అసలు ఇక్కడ ఏం జరుగుతుంది అనే దానిపై అనేక ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. శనివారం మృతి చెందిన ఆడపులి గత ఏడాది కాలంగా కాగజ్‌నగర్ దరిగాం ప్రధానకాల్వ అటవీ ప్రాంతాల్లో తరుచూ దర్శనమిస్తోంది. ఈ క్రమంలోనే అవి రెండు పిల్లలకు జన్మనిచ్చినట్టు సమాచారం. కూనల వయస్సు ఏడాది వరకు ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. తాజాగా ఆడ పులి చనిపోవటంతో దాని పిల్లలు ఏమై పోయాయని అధికారులు ఆరా తీస్తున్నారు. అయితే సోమవారం చనిపోయి ఉన్న ఆడపులి ఆ కూనల్లో ఒకటా? లేక వేరే పులా? అనేది తేలాల్సి ఉంది. సోమవారం ఈ ఉదంతం వెలుగులోకి రాగానే మీడియా అక్కడికి వెళ్లేందుకు ప్రయత్నించగా అటవీఅధికారులు రాకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టడం అనేక అనుమానాలకు తావిస్తోంది. దరిగాం అటవీ ప్రాంతంలో మృతి చెందిన పెద్దపులి ఆవశేషాలను అధికారులు సేకరించి హైదరాబాద్‌లోని ఫోరెన్సిక్ ల్యాబ్‌కి తరలించారు. దరిగాంలోకి మృతిచెందిన ఆడపులి ఆదిపత్య పోరు వల్ల చనిపోయిందని అధికారులు ప్రకటించగా, విషం పెట్టి చంపారా అన్నది అనుమానం? ఈ నేపథ్యంలో నిజాలను నిగ్గు తెల్చేందుకు అవశేషాలను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించనట్టు ప్రచారం జరుగుతోంది. ఇటీవల కాలంలో అటు మహారాష్ట్ర, తెలంగాణ ప్రాంతాల్లో పదికిపైగా పెద్దపులులు ఇదే తరహాలో అనుమానస్పదంగా మృతి చెందాయి. ఇందులో ఒక మహారాష్ట్రలోనే ఏడు పులులు మృతి చెందగా, తెలంగాణ మహారాష్ట్ర సరిహద్దులో మరో మూడు పులులు మృతి చెందినట్లయింది. మహారాష్ట్ర ఉదంతంలో ఇక్కడి అధికారులు ఇదేతరహాలో ఆదిపత్య పోరాటాలు కథనాలు విన్పించగా, ఆ ఘటనల తర్వాత మహారాష్ట్ర ప్రభుత్వం సంబంధిత అధికారులపై వేటు వేసింది.

'గంగాపూర్' దశ మారేనా?

- ఏళ్లతరబడి కొనసాగుతున్న ప్రాజెక్టు నిర్మాణపనులు
- కొత్త ప్రభుత్వం ఏర్పాటుతో చిగురిస్తున్న ఆశలు



బీడు భూములను పంట పొలాలుగా మార్చాలనే లక్ష్యంతో రెబ్బెన మండలం నంబాల వాగుపై మంజూరైన గంగాపూర్ ప్రాజెక్టుపై ఆశలు చిగురిస్తున్నాయి. 1300ఎకరాలకు సాగు నీరందంచేలా ప్రాజెక్టు రూపకల్పన చేసి 2008లో నిర్మాణపనులు ప్రారంభించారు. 15ఏళ్లు గడుస్తున్నా పనులు మాత్రం పూర్తి కాలేదు. ప్రాజెక్టు తూము, కాల్వ నిర్మాణానికి కావాల్సిన భూ సేకరణ పనులు కూడా పూర్తి చేయలేదు.

రెబ్బెన, జనవరి 8: రాష్ట్రంలో మరోసారి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావటంతో గంగాపూర్ ప్రాజెక్టు నిర్మాణంపై రైతుల్లో ఆశలు చిగిరిస్తున్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో అప్పటికాంగ్రెస్ ప్రభుత్వం 2008లో నంబాల వాగుపై ప్రాజెక్టును నిర్మించతలపెట్టింది. వాగుకు అడ్డంగా మట్టికట్ట నిర్మించి తూము, కాల్వల ద్వారా పంట పొలాలకు సాగునీరు అందించాలని ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. రూ.8కోట్ల ప్రాజెక్టును మంజూరు చేయగా, 2009 లో పనులు ప్రారంభించారు. అయితే 2010లో ఉన్నత స్థాయి ఇంజనీరింగ్ అధికారులు ప్రాజెక్టు పనులను సందర్శించి ప్రాజెక్టు డిజైన్ మార్చాలని ఆదేశించారు.

వాగుకు అడ్డంగా మట్టికట్టల నిర్మిస్తే వరద ఉధృతికి కొట్టుకపోయే ప్రమాదం ఉందని, మట్టికట్టల స్థానంలో కాంక్రీట్ పనులు చేపట్టి కాల్వ ద్వారా నీటిని మళ్లించాలని సూచించారు. ప్రాజెక్టు డిజైన్‌ను మార్చటంతో రూ.8కోట్ల అంచనా వ్యయం మూడురెట్లు పెరిగింది. కాంట్రాక్టర్ స్పిల్‌వే పనులు పూర్తి చేయకుండానే చేతులెత్తాశారు. సుమారు నాలుగేళ్లగా ఎలాంటి పనులు సాగటం లేదు. ఇరిగేషన్ అధికారులు మాత్రం కాంట్రాక్టర్లపై ఉదాసీనంగా వ్యవహరిస్తూ గడువు పెంచుతూ వస్తున్నారు. పనులు చేపట్టిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోకుండా మీనమేషాలు లెక్కిస్తున్నారు.

సాగునీటి వనరులు లేక రెబ్బెన మండల రైతులు వర్షాధార పంటలు సాగు చేస్తున్నారు. గోలేటి రిజర్వాయర్ వట్టివాగు కాల్వల అందుబాటులో ఉన్న కాల్వల నిర్మాణం సక్రమంగా లేక పొలాలకు సాగునీరు అందటం లేదు. రైతులు ఆరుతడి పంటల సాగుకే మొగ్గు చూపుతున్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని దివంగత ముఖ్యమంత్రి వైఎస్ఆర్ గంగాపూర్ ప్రాజెక్టును మంజూరు చేశారు. 1300ఎకరాలకు సాగు అందించే వీలుగా రూపొందించారు. నంబాల, గంగాపూర్, దర్మారం, లక్ష్మీపూర్, సాలిగాం గ్రామాల్లో పొలాలకు చెరువులకు నీరు అందించాలన్న లక్ష్యంతో చేపట్టారు. ఈ ప్రాజెక్టులో 320 మీటర్ల పొడవైనా స్పిల్‌వే నిర్మించాల్సి ఉండగా కేవలం 292మీటర్లు మాత్రమే నిర్మించారు. ఇంకా 9.5 కిలోమీటర్ల కాల్వ పనులు ఇంకా ప్రారంభం కాలేదు. భూ సేకరణలో రెవెన్యూ శాఖ అంతులేని జాప్యం చేస్తుండటంతో కాల్వ పనులకు 70వేల ఎకరాలు సేకరించాల్సి ఉంది. 2015లో ఇరిగేషన్ అధికారులకు ప్రాజెక్టుకు సంబంధించి భూమి, భూసేకరణ తదితర అంశాలతోకూడిన వివరాలను రెవెన్యూ శాఖకు అప్పగించారు. అయినా ఇంత వరకు భూ సేకరణ పనులు ప్రారంభం కాలేదు.

ప్రాజెక్టును పూర్తి చేయాలి..

: అరుణ్, రైతు, గంగాపూర్



15ఏళ్ల క్రితం నంబాల వాగుపై ప్రాజెక్టు పనులు చేపట్టారు. ఇప్పటివరకు పనులు పూర్తి కాలేదు. కొత్త ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించి రైతులకు న్యాయం చేస్తే బాగుంటుంది. రైతులు ప్రాజెక్టు కోసం ఎంతగానో ఎదురు చూస్తున్నారు.త్వరితగతిన పనులు ప్రారంభించేట్టు చూడాలి.

కొత్త ప్రభుత్వంపైనే ఆశలు..: వెంకన్న, గంగాపూర్



నంబాల ప్రాజెక్టు నిర్మిస్తారని కొత్త ప్రభుత్వంపై రైతులు ఆశలు పెంచుకున్నారు. కాంట్రాక్టర్ పనులు పూర్తి చేయలేదు. అధికారులు భూ సేకరణ విషయం తేల్చా లి. త్వరితగతిన పనులు ప్రా రంభిస్తే రైతులకు కొంతమేర మేలు జరుగుతుంది. ఏటా వర్షాధార పంటలపైనే ఆధారపడాల్సి వస్తోంది. ప్రాజెక్టు పూర్తిచేస్తే ఈ సమస్య ఉండదు.

రైతులకు ఉపయోగపడుతుంది..

సాయి, నంబాల



రైతులకు ఉపయోగపడే ఈ ప్రాజెక్టును అధికారులు వెంటనే పూర్తి చేయాలి. ఆల స్యం చేయకుండా భూసేకరణ పనులు, ప్రాజెక్టు పనులు వేగవంతం చేయాలి. లేకుంటే రైతులు మళ్లీ వర్షాధార పంటలపైనే ఆధారపడాల్సి ఉంటుంది.



అసంపూర్తిగా మిగిలిన ప్రాజెక్టు నిర్మాణ పనులు

వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

- రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి శాంతకుమారి



వీసీలో పాల్గొన్న కలెక్టర్, అదనపు కలెక్టర్‌లు

ఆసిఫాబాద్, జనవరి 8: ఈనెల 6వరకు నిర్వహించిన ప్రజాపాలనలో పజల నుంచి అందిన దరఖాస్తుల పూర్తి వివరాలను ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి శాంతికుమారి అన్నారు. సోమవారం ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపుకలెక్టర్‌లు, అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ ప్రజా సంక్షేమ దృష్ట్యా ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమంలో అందిన దరఖాస్తుల వివరాలను ఆన్‌లైన్‌లో స్పష్టంగా నమోదు చేయాలని తెలిపారు. మహాలక్ష్మి, రైతుభరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు, చేయూత పథకాలు, నూతన రేషన్‌కార్డులు, పెన్షన్ కొరకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ హేమంత్ బోర్కడే మాట్లాడుతూ ఈ నెల6 వరకు దరఖాస్తులు స్వీకరించామని, వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామన్నారు. ఈనెల17లోగా నమోదు ప్రక్రియ పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలోని రైస్ మిల్లర్లకు నిర్దేశించిన సీఎంఆర్ లక్ష్యాలను పూర్తి చేసే విధంగా సంబంధిత అధికారులు, రైస్‌మిల్లర్ల సమన్వయంతో కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్‌లు దాసరి వేణు, దీపక్ తివారి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

పీఆర్టీయూటీఎస్ క్యాలెండర్ ఆవిష్కరణ



కౌటాలలో క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎంఈవో

పెంచికలపేట/కౌటాల, జనవరి 8: పీఆర్టీయూటీఎస్ నూతన సంవత్సర క్యాలెండర్లను సోమవారం పెంచికల పేట, కౌటాలమండలాలలోని జడ్పీఎస్ఎస్ పాఠశాలల్లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ కావ్య, ఎస్సై కొమురయ్య, గ్రామపెద్దలు నగేష్, ప్రధానోపాధ్యాయు రాలు విజయనిర్మల, కౌటాలలో ఎంఈవో సోమయ్య, ప్రధానోపాధ్యాయుడు ఎంఎల్ రాజు, గణపతి, రమేష్, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

దహెగాం, జనవరి 8: మండలపరిషత్ కార్యాలయంలో ఈనెల10న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రాజేశ్వర్ గౌడ్, ఎంపీపీ సులోచనలు ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి అన్నిశాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు విధిగా హాజరు కావాలన్నారు.

ప్రజావాణి సమస్యల పరిష్కారానికి కృషి

- కలెక్టర్ హేమంత్ బోర్కడే



అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే

ఆసిఫాబాద్, జనవరి 8: ప్రజావాణి కార్యక్రమంద్వారా ప్రజలసమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని కలెక్టర్ హేమంత్ బొర్కడే అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ దాసరి వేణుతో కలిసి అర్జీదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. జిల్లాలోని ఆశ్రమ పాఠశాలల ఏఎన్ఎంలు ప్రభుత్వ గిరిజనసంక్షేమశాఖ పరిధిలోని ఆశ్రమపాఠశాలలు, వసతిగృహాలలో పొరుగుసేవల పద్ధతిన తమను విధుల్లోకి తీసుకో వాలని దరఖాస్తులు అందజేశారు. కాగజ్‌నగర్ పట్టణంలోని కౌసర్‌నగర్‌కు చెందిన రజియా బేగం తనకు వితంతుపెన్షన్ మంజూరు చేయాలని, కాగజ్‌నగర్‌కు చెందిన కొత్రంగి స్వరూప తన ఎడమచేతి నాలుగు వేళ్ల ముడుచుకుని ఉంటాయని సదరం సర్టిఫికేట్‌లో జీరో శాతంగా వచ్చిందని మరొకసారి అవకాశం కల్పించాలని అర్జీ సమర్పించారు. కాగజ్‌నగర్ పట్టణంలోని పెట్రోల్‌పంపు ఏరియాకు చెందిన విజయ్‌కు మార్ తాను చెవుడు, మూగ దివ్యాంగుడినని డిగ్రీ పూర్తి చేశానని తనకుఉపాధి కల్పించాలని దరఖాస్తు అందజేశారు. వాంకిడి మండలం ఖిరిడి గ్రామానికి చెందిన జాడిసునీత తాను రోజుకూలి పనిచేసుకుని జీవిస్తున్నానని తనకుఉపాధి కల్పించాలని దరఖాస్తు అందజేశారు. పెంచికల పేట మండలం కమ్మర్‌గాం గ్రామానికి చెందిన చిన్నక్క తనకు వినికిడిలోపం ఉన్నందున సదరం ఇచ్చి న్యాయం చేయాలని దరఖాస్తు అందజేశారు. జైనూరు మండలం జంగాపూర్ కిషన్‌నాయక్ తండా గ్రామానికి చెందిన శంకర్ తన భార్య దూరిబాయి పేరిట గ్రామశివారులో ఉన్న భూమిని ఆమె మరణించిన తరువాత తనకు తెలియకుండా తన కుమారులు పట్టా మార్చుకున్నారని, ఈ విషయమై విచారించి న్యాయం చేయాలని దరఖాస్తు అందజేశారు. వాంకిడి మండలం గోయగాం గ్రామానికి చెందిన దుర్గా సగుప్త బసు తమ గ్రామంలో అంగన్‌వాడీ ఆయా పోస్టు ఖాళీగా ఉందని తనకుఅవకాశం కల్పించా లని దరఖాస్తు అందజేశారు. వాంకిడ మండలం నవగూడ గ్రామానికి చెందిన శకంర్ తనకు చెవుడు ఉందని, గతంలో సదరం శిబిరంలో మోటారుగా దరఖాస్తు చేశానని, దానిని చెవుడుగా మార్చి తనకు అవకాశం కల్పించాలని దరఖాస్తు అందజేశారు.

సమస్యలు పరిష్కరించాలి

- ఎంఈవో కార్యాలయం ఎదుట మధ్యాహ్నభోజన కార్మికుల ధర్నా



వినతి పత్రం అందజేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

కౌటాల, జనవరి 8: సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎంఈవో కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ఏడు నెలల వేతనం అందించాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం రూ.26వేల వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని, ఈఎస్ఐ, పీఎఫ్, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు శారద,పద్మ,లక్ష్మి,నిర్మల,సిందుబాయి, కమల, తార తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

ఆసిఫాబాద్‌రూరల్, జనవరి 8: రాంపూర్ విద్యారణ్య ఆవాస విద్యాలయంలో ఈనెల6న నిర్వహించిన కుమరంభీం, మంచిర్యాల, పెద్దపల్లిజిల్లాల విభాగ్‌స్థాయి ఖేల్‌కూద్ పోటీల్లో ఆసిఫాబాద్ విద్యార్థులు ప్రతిభ కనబర్చి ఈనెల28,29,30తేదీల్లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. శిశువర్గలో 100, 400 మీటర్ల పరుగు పందెంలో జి రిషిత ప్రథమ, బాలవర్గలో 100,400మీటర్ల పరుగుపందెంలో మెంగ్రె శిరీష ప్రథమ, 200మీటర్ల పరుగు బామ్నె ఆశ్విత ద్వితీయ, కిశోర వర్గలో 100, 400మీటర్ల పరుగుపందెంలో కురాటీకర్ అక్షర ప్రథమ, 200మీటర్ల పరుగుపందెంలో కోలె నిఖిత ప్రథమ, షాట్‌పుట్‌లో ద్వితీయ, 80మీటర్ల పరుగు పందెంలో కోలెఅశ్విని ప్రథమస్థానంలో నిలిచినట్లు తెలిపారు. వీరినిసమితి అధ్యక్షుడు సతీష్‌బాబు, నాగులశ్రీనివాస్, పాఠశాల కార్యదర్శి వేణుగోపాల్, సహకార్యదర్శి మధుకర్, గుర్రాల వెంకటేశ్వర్, పోషకులు కకమలాకర్, విశాల్, దీపక్, తదితరులు అభినందించారు.

ఆర్థికసాయం అందజేత

బెజ్జూరు, జనవరి 8: మండల కేంద్రానికి చెందిన కంబాల సంతోష్, ఎల్కపల్లికి చెందిన జంగంపల్లి బాన య్య సోమవారం అనారోగ్యంతో మృతిచెందగా ఆయా కుటుంబాలను కాంగ్రెస్‌నాయకుడు శ్రీవర్ధన్ పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెన్షన్, మహాలక్ష్మి పథకాలు వర్తింపజేసేందుకు కృషి చేస్తామన్నారు. ఆయనవెంట నాయకులు బాబురావు, గంగయ్య, హనుమంతు ఉన్నారు.

అపరిశుభ్రంగా పాఠశాలల ఆవరణ



పాఠశాల ఆవరణలోని మురుగు నీటిలో తిరుగుతున్న పందులు

సిర్పూర్(టి), జనవరి 8: మండలకేంద్రంలోని ఆశ్రమోన్నత పాఠశాల (బాలుర), జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణల్లో మురికినీటితో అపరిశుభ్రత నెలకొంది. పాఠశాలల సమీపంలో డ్రైనేజీ లేకపోవడంతో రెండు పాఠశాలల వంటగది, క్లాస్‌రూంల వద్ద మురుగునీరు వచ్చి చేరుతోంది. దీంతో దుర్వాసన, పందుల బెడదతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు దీనిపె దృష్టిసారించాలని పిల్లల తల్లి దండ్రులు, టీచర్లు కోరుతున్నారు.



మురుగు నీటితో ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు

పాఠశాలను సందర్శించిన సర్పంచ్

పెంచికలపేట, జనవవరి 8: మండలకేంద్రంలోని జడ్పీ పాఠశాలను సోమవారం సర్పంచ్ కావ్య సందర్శించారు. డిజిటల్‌బోధన, 10వ తరగతి ప్రత్యేక తరగతులు, విద్యార్థుల హాజరు, మన ఊరు మనబడి పనులను పర్య వేక్షించారు. విద్యార్థులు చక్కగా చదువుకొని భవిష్యత్‌లో మంచి స్థాయికి చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రధానో పాధ్యాయురాలు విజయనిర్మల, ఉపాధ్యాయులు యాదగిరి, శ్రీధర్, నాయకులు నగేష్ పాల్గొన్నారు.



రమేష్ మృతిని గని ప్రమాదంగా గుర్తించిన యాజమాన్యం

మందమర్రిటౌన్, జనవరి 8: ఏరియాలోని కాసిపేట2 గనిలో మైనింగ్‌సర్దార్‌గా పనిచేస్తూ ప్రమాదంలో గాయపడి మృతిచెందిన రమేష్ మృతిని గనిప్రమాదంగా యాజమాన్యం గుర్తించిందని ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, ఏరియా కార్యదర్శి భీమనాథుని సుదర్శన్ సోమవారం తెలిపారు. తమ యూనియన్ రాష్ట్రఅధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య సింగరేణి డైరెక్టర్లతో మాట్లాడి రమేష్ కుటుంబ పరిస్థితిని వివరించారన్నారు. కార్మికుడి కుటుంబానికి న్యాయం చేయాలని ఏఐటీయూసీ ఆందోళనలు చేసిందన్నారు. రమేష్ కుటుంబానికి కంపెనీ అన్ని బెనిఫిట్స్ రానున్నాయని తెలిపారు. రమేష్ వైద్యం విషయంలో నిర్లక్ష్యంచేసిన వైద్యులపై చర్యలు తీసుకుంటుందని యాజ మాన్యం పేర్కొన్నట్లు తెలిపారు. అంతకుముందు యూనియన్ కార్యాలయంలో మౌనం పాటించారు.

నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ

శ్రీరాంపూర్, జనవరి 8: సింగరేణి ఎస్‌సి,ఎస్‌టీఉద్యోగుల సంక్షేమ సంఘం(140/2018) ఆధ్వర్యంలో ముద్రించిన నూతనసంవత్సరం క్యాలెండర్‌ను శ్రీరాంపూర్ జీఎం బి సంజీవరెడ్డి సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్‌సి లైజన్ అధికారి కిరణ్ కుమార్, లా అధికారి మల్లేష్, సంఘం సలహాదారు చిరంజీవులు, ఏరియా ఉపాధ్యక్షుడు దేగల ప్రవీణ్, కార్యదర్శి వెంకటేష్, నాయకులు మేడ పెద్దయ్య, మురళి, శంకరయ్య శ్రీనివాస్, గునిగంటి నర్సింగారావు, కమల్ కుమార్ పాల్గొన్నారు.

ఆర్కే5బీ కార్మికులకు వసతులు కల్పించాలి

శ్రీరాంపూర్, జనవరి 8: శ్రీరాంపూర్‌లోని ఆర్కే5బి సెక్షన్ కార్మికులకు వసతులు కల్పించాలని ఐఎన్‌టీయూసీ నాయకులు కోరారు. ఆర్కే5బి సెక్షన్ నుంచి ఉత్పత్తి నిలిపివేసిన అనంతరం కార్మికులు ఆర్కే5 షైన్‌కు బదిలీ అయ్యారని తెలిపారు. డ్యూటీలకు వచ్చే వారికి గదులు, లాకర్లు, నీటి సరఫరా, వాహనాల కోసం షెడ్లు నిర్మించాలని కోరారు. అనంతరం ఇన్‌చార్జి మేనేజర్ శివయ్యకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో పిన్నింటి మల్లారెడ్డి, ఆకుల రాజయ్య, రామిడి మహేందర్ రెడ్డి పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ కార్మికుడు మృతి



రమేష్ (ఫైల్)

మందమర్రిటౌన్, జనవరి 8: మందమర్రి ఏరియాలోని కాసిపేట2గనిలో సీనియర్ మైనింగ్ సర్దార్‌గా విధులు నిర్వహిస్తున్న మచ్చ రమేష్(32) గని ప్రమాదంలో గాయపడి గోదావరిఖని ఏరియా ఆసుపత్రిలో చికిత్సపొందుతూ సోమవారం మృతిచెందాడు. రెండు వారాల క్రితం విధినిర్వహణలో కాలుజారిపడగా గాయాలపాలయ్యాడు. చికిత్సకోసం గోదావరిఖని ఆసుపత్రికి తరలించగా 15రోజులుగా చికిత్సపొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందాడు. మృతివిషయాన్ని తెలుసుకున్న గుర్తింపుసంఘం నాయకులు సలేంద్ర సత్యనారాయణ, దాగంమల్లేష్ మృతదేహాన్ని పరిశీలించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు.

-కోటి రూపాయల నష్టపరిహారం చెల్లించాలి

మచ్చ రమేష్ మృతిని గనిప్రమాదంగా గుర్తించి కోటిరూపాయల నష్టపరిహారం చెల్లించి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని ఏఐటీయూసీ సబ్‌కమిటీ మైనింగ్‌స్టాఫ్ బీపీఏ రీజియన్ కార్యదర్శి రాజేశ్వర్ రావు, గోపతి సత్యనారాయణ, కాసిపేట2 గనినాయకుడు సుభాస్‌చంద్రబోస్ డిమాండ్ చేశారు. వైద్యులనిర్లక్ష్యం కూడా ఉందని, వారిపైచర్యలు తీసుకోవాలన్నారు. నాయకులు రాజేష్, తిరుపతిగౌడ్ పాల్గొన్నారు.

కుటుంబాన్ని ఆదుకోవాలి

శ్రీరాంపూర్: మరణించిన రమేష్(32) కుటుంబాన్ని యాజమాన్యం ఆదుకోవాలని మైనింగ్‌స్టాఫ్ బెల్లంపల్లి రీజియన్‌కార్యదర్శి వంగరి రాజేశ్వర్‌రావు, మైనింగ్‌స్టాఫ్ ఇన్‌చార్జి గోపతి సత్యనారాయణ డిమాండ్ చేశారు. గనిప్రమాదంగా పరిగణిస్తూ మృతుడి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, కోటి రూపాయల నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

కాసిపేట: కాసిపేట 2వగనిలో విధులు నిర్వహిస్తున్న మచ్చ రమేష్(32) వైద్యుల నిర్లక్ష్యంతో మృతిచెందాడని ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచికార్యదర్శి దాగం మల్లేష్ అన్నారు. సోమవారం సోమగూడెంలో ఆయన మాట్లాడుతూ కేవలం వైద్యుల నిర్లక్ష్యంతోనే కార్మికుడుమృతి చెందాడన్నారు. మృతుడి కుటుంబానికి కోటి రూపాయల నష్టపరిహారం చెల్లించి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. వైద్యచికిత్సలు అందించడంలో నిర్లక్ష్యంచేసిన డాక్టర్లపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. లేదంటే సింగరేణివ్యాప్తంగా ఆందోళనలు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు సుభాష్‌చంద్రబోస్, సంతోష్, కేతన్, లింగమూర్తి పాల్గొన్నారు.

సరైన చికిత్స చేయకపోవడం వల్లనే..

గోదావరిఖని: వైద్యులు సరైన చికిత్స చేయకపోవడం వల్లనే రమేష్ మృతిచెందాడని, బంధువులు, కార్మికులు, కార్మికసంఘాలనాయకులు ఆరోపించారు. 16రోజులుగా ఎలాంటి వైద్య సేవలందించలేదని, ఏం వైద్యసేవలు అందించారో చెప్పాలని డిమాండ్ చేసినా పట్టించుకోవడం లేదని, రమేష్‌కు ఎలాంటి ఆరోగ్య సమస్యలు లేవని, వైద్యులనిర్లక్ష్యం వల్లనే మృతిచెందాడని, మృతుని కుటుంబానికి న్యాయం చేయాలని, వైద్యులపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

కార్మికులు, నాయకుల ఆందోళన



మృతదేహాన్ని పరిశీలిస్తున్న గుర్తింపు సంఘం నాయకులు

వైద్యుల నిర్లక్ష్యంవల్లనే రమేష్ మృతి చెందాడంటూ సీఎంవో కిరణ్‌రాజ్ చాంబర్‌లో ఆందోళనకుదిగారు.సీఐటీయూ నాయకుడు మెండెశ్రీనివాస్, కాంగ్రెస్ నాయకుడు పెండ్యాలమహేష్ మాట్లాడుతూ సింగరేణిలో కార్మికులకు సరైన వైద్యంఅందడం లేదని, ఆసుపత్రిలో రమేష్‌కు ఇచ్చిన మందుల వల్లనే అతను మృతిచెందాడని, ఆసుపత్రిలో సూపర్‌స్పెషాలిటీ డాక్టర్లను నియమించాలని ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని, ఎల్1మందులు వాడవద్దని చెప్పినా వాడుతున్నారని, వైద్యులపర్యవేక్షణలో చికిత్సచేయాల్సి ఉండగా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. మృతదేహాన్ని ఐఎన్‌టీయూసీ సెక్రటరీజనరల్ జనక్‌ప్రసాద్ పరిశీలించారు. యాజమాన్యంనిర్లక్ష్యం వల్లనే రమేష్ మృతి చెందాడని ఆయన ఆరోపించారు. వైద్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.